

హనుమాన్ చాలీసా పారాయణం

గోళ్లపాడు(ముప్పాళ్ల): మండలంలోని గోళ్లపాడు గ్రామంలో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్‌చాలీసా పారాయణం శనివారం నిర్వహించారు.



వరలక్ష్మి అమ్మవారి వ్రత పూజ

నగరం: మండలంలోని పెద్దవరం గౌడపాలెంలో ఉన్న శ్రీరామాలయంలో వరలక్ష్మి వ్రత పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



మార్కండేయ జయంతి

తాడేపల్లిరూరల్ : మంగళగిరి నాంచారమ్మ చెరువు ప్రాంగణంలో ఉన్న భద్రావతి సమేత భావనాఋషిస్వామి ఆలయంలో శనివారం మార్కండేయ జయంతి నిర్వహించారు.

న్యూస్‌రీల్

తిరునాళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- గోవాడ తిరునాళ్లపై అధికారులతో సమీక్ష
- రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి



రేపల్లె రూరల్: తిరునాళ్లకు వచ్చే భక్తులకు లోటులేకుండా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు శక్తివంచన లేకుండా పనిచేయాలని ఆర్డీఓ నేలపు రామలక్ష్మి అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా డివిజన్‌లోని గోవాడ బాలకోటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 26న జరగనున్న తిరునాళ్లను పురస్కరించుకుని ఆలయ పరిధిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ శాఖల అధికారులతో శనివారం రేపల్లె పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆలయ ఆవరణలో భారీ గేట్లు ఏర్పాటు చేయాలన్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లలో వెళ్లే భక్తులకు మధ్యలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలను ఎంపిక చేయాలన్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసే వివిధ స్టాళ్లు విధిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఆలయం, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఆ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. పోలీసు అధికారులు తిరునాళ్లలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. మండల పరిషత్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్యం లోపించకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, పశువైద్యశాలల వైద్యులు అందుబాటులో ఉండి తమ సేవలు అందించాలన్నారు. పలు అంశాలపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు సేఫ్టీ జాకెట్స్ వితరణ



తాడేపల్లి రూరల్: మణిపాల్ హాస్పిటల్ విజయవాడ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన సేఫ్టీ జాకెట్లను శనివారం గుంటూరు పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మణిపాల్ హాస్పిటల్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజీ వైద్యులు డాక్టర్ రామకృష్ణ, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ హెడ్ రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 4 ప్రపంచ క్యాన్సర్ డేను పురస్కరించుకుని సేఫ్టీ జాకెట్స్‌ను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు ఫ్యామిలీ కోర్టు జడ్జిగా లీలావతి



నగరంపాలెం: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తోన్న సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి టి.లీలావతి పదోన్నతిపై కర్నూలు జిల్లా ఫ్యామిలీ కోర్టు జడ్జిగా బదిలీయ్యారు. రెండు రోజుల కిందట ఆమె బాధ్యతల నుంచి రిలీవయ్యారు. ఆమె స్థానంలో న్యాయసేవాధికారి సంస్థ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా ఒకటో సబ్ కోర్టు జడ్జి గోపాలకృష్ణ బాధ్యతలు స్వీకరించారు.

మంగళగిరి కొండపై అగ్ని ప్రమాదం



మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి పట్టణ పరిధిలోని ఎగువ నరసింహస్వామి, గండాలయ స్వామి దేవస్థానం కొండపై శనివారం రాత్రి మంటలు చెలరేగాయి. అవి దిగువ ప్రాంతానికి కూడా వ్యాపిస్తుండడంతో నివాసితులు ఆందోళన చెందుతూ అధికారులకు ఫోన్లు చేశారు. సహజంగా ఎప్పుడూ చెలరేగే మంటలే కదా అంటూ నిర్లక్ష్యం వహించడంతో అక్కడి ప్రజలు మరింత భయాందోళనకు గురయ్యారు. చివరకు రెండు గంటల అనంతరం తగ్గుముఖం పట్టడంతో ఊపిరి పీల్చుకున్నారు.

నిరాశపరిచిన నిర్మలమ్మ



- పర్యాటకం ఊసేది?
- పరిశ్రమలకు ఊతమేదీ?
- మత్స్య, ఆక్వా రంగానికి చేయూత కరువు
- వ్యవసాయ రంగానికి మొండిచేయి
- వాన్‌పిక్, హార్బర్‌లు, తీరం అభివృద్ధికి నిధులేవీ?
- బడ్జెట్‌పై సర్వత్రా విమర్శలు



చీరాల సముద్ర తీరం



నిజాంపట్నం హార్బర్

సాక్షి ప్రతినిధి,బాపట్ల: ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ బాపట్ల జిల్లా వాసులను నిరాశపరిచింది. జిల్లాలో తీర ప్రాంతం విస్తారంగా ఉంది. నిజాంపట్నం హార్బర్‌తోపాటు చీరాల, సూర్యలంక ప్రాంతాల్లో పర్యాటక రంగం అభివృద్ధికి ఎలాంటి కేటాయింపులు లేవు. చేనేత రంగంపై ఆధారపడి వేలాది మంది కార్మికులు జీవిస్తున్నారు. ఈ రంగానికి కూడా మొండి చేయి చూపారు. జీరో బడ్జెట్‌కు రూ.164 కోట్లు కేటాయించినట్లు చెప్పినా మెట్ట ప్రాంతాలకు ఉపయోగం తప్ప కృష్ణా, నాగార్జునసాగర్ కాలువలతో సాగునీటి లభ్యత ఉన్న బాపట్ల జిల్లాకు పెద్దగా ఉపయోగంలేదు.

- సాగునీటి రంగానికి రూ.242 కోట్లు కేటాయించినట్లు చూపారు. ఈ నిధులు ప్రధాన కాలువల్లో పూడికతీతకు కూడా సరిపోవు. జిల్లాలో 100 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములు మూతపడ్డాయి. వాటి బాగుకోసం పైసా నిధులు ఇచ్చిన పరిస్థితి లేదు. ఇవికాకుండా అద్దంకి ప్రాంతంలో గుండ్లకమ్మ, చినపోలిరెడ్డి ఎత్తిపోతలతోపాటు పలు చిన్నతరహా సాగు, తాగునీటి ప్రాజెక్టులు ఉన్నాయి. బడ్జెట్‌లో వాటికి నిధుల కేటాయింపులు లేవు.
- ఆక్వా రంగానికి నిధులు కేటాయించలేదు. జిల్లాలో 70 కిలోమీటర్ల మేర తీరప్రాంతం ఉండగా 25 వేల ఎకరాల్లో ఆక్వా సాగుంది. ప్రతి ఏటా 3.54 లక్షల మెట్రిక్ టన్నుల ఆక్వా ఉత్పత్తులు ఉండగా 65 వేల మెట్రిక్ టన్నులు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ప్రభుత్వం ప్రోత్సాహం కరువవడంతో ఆక్వా అభివృద్ధి చెందే అవకాశం కనిపించడంలేదు. ఆక్వా రంగంలో దిగుమతి చేపలపై 30 శాతం సుంకం ఉండగా దానిని 25 శాతం తగ్గించారు. దీనివల్ల మన ప్రాంతానికి తీరని నష్టం. ఆక్వాలో దిగుమతి ఫీడ్, ఫీడ్ తయారీ మినరల్స్‌కు 5 శాతం సుంకం వుంది. దానిని పూర్తిగా తగ్గించాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉన్నా దానిని మాత్రం పట్టించుకోవడంలేదు.
- నిజాంపట్నం హార్బర్ పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. ఆక్వా పార్కు మొదలు కాలేదు. మినీ హార్బర్‌ల నిర్మాణ ప్రతిపాదనలూ ఉన్నాయి. టూరిజం అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా పైసా నిధులు కేటాయింపులు లేవు. కేంద్రం తీరుపై స్థానికంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి.
- తీరంలో పరిశ్రమలు వస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. మత్స్యకారులకు మేలు జరుగుతుంది. పరిశ్రమల ఏర్పాటు, టూరిజం అభివృద్ధితో అన్నిరంగాలకు ఉపాధి లభిస్తుంది. కానీ కేంద్రం పైసా విదల్చలేదు.
- వ్యవసాయ, అనుబంధరంగాల అభివృద్ధికి నామమాత్రపు కేటాయింపులు లేవు. రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసే పరిస్థితి కూడా ప్రభుత్వానికి లేకపోతే వ్యవసాయరంగానికి ఏరకం ప్రోత్సాహం అందించినట్లు.
- రూ.12 లక్షల వరకూ పన్ను రాయితీ కల్పించామని కేంద్రం గొప్పగా చెప్పుకుంటుంది. జిల్లాలో సుమారు లక్ష మంది వరకూ పన్నులు చెల్లించే వారు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. దీనివల్ల ఎగువ మధ్యతరగతి వర్గాలకే కాస్త ప్రయోజనం తప్ప అందరికీ కాదు. రూ.లక్షకు పైగా జీతం ఉన్నవారికే కాస్త లబ్ధి. సగటున జిల్లాలో బేసిక్ శాలరీ రూ.25 వేలకు మించి లేదు. అటువంటి వారికి ప్రయోజనం లేదు.

ఈ బడ్జెట్‌లో జిల్లాకు మొండిచేయి చూపారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి హార్బర్, పర్యాటక రంగం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు.

మధ్య తరగతికి ఊరట




ఆదాయ పన్ను మినహాయింపు మధ్యతరగతి ప్రజానీకానికి ఊరట కలిగించే అంశం. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆహార భద్రత కోసం జన్యు బ్యాంకులను ఏర్పాటు చేయడం కూడా హర్షనీయం. ఇంకా ఎగమతులు పెంచేలా చర్యలు చేపట్టడం ముదావహం. పెట్టుబడుల ఉపసంహరణకు, ఆస్తులు విక్రయానికి పథకాలు రూపొందించడం ప్రభుత్వరంగ సంస్థలను బాగా దెబ్బతీస్తుంది. బీమా రంగంలో ఎఫ్‌డీఐలను 100 శాతానికి పెంచడం కూడా ప్రతికూల అంశం.

డాక్టర్ పి.సి.సాయిబాబు, రిటైర్డు అధ్యాపకులు



కేంద్ర బడ్జెట్ నిరాశజనకం



కేంద్ర బడ్జెట్ నిరాశ జనకంగా ఉంది. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి తగిన నిధులు సాధించటంలో విఫలమైంది. దేశంలో, రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పెరుగుతున్నా సమస్యను నివృత్తి చేసేందుకు నిధుల కేటాయింపు లేకపోవటం విచారకరం. పరిశ్రమలు నెలకొల్పేందుకు అనుకూలమైన తీర ప్రాంతానికి నిధులు కేటాయింపులు శూన్యం. నిజాంపట్నం హార్బర్ పూర్తిచేసి దిండి ప్రాంతంలో ఆక్వా పార్కు నిర్మిస్తే తీరప్రాంతం అభివృద్ధి చెందటంతోపాటు అనేక మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయింపులు చేయాలి

–డాక్టర్ ఈవూరు గణేష్, వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త

ప్రైవేటీకరణకు బాటలు



కేంద్ర బడ్జెట్‌లో విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి తగినన్ని నిధుల కేటాయింపులు లేవు. మరోసారి రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. దేశంలో పేదరికం, నిరుద్యోగం రూపుమాపటానికి కాకుండా ప్రైవేటీకరణకు బాటలు వేసేలా కేంద్ర బడ్జెట్ రూపొందింది. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకపోవటం, ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని ప్రకటించకపోవటం శోచనీయం. జీఎస్టీ పేరుతో పన్నులు వసూలు చేస్తూనే 36 రకాల మందులపై పన్నులు తగ్గించామని ప్రకటించటం సిగ్గుచేటు. ధన్ ధాన్య యోజన పేరుతో రైతులకు లబ్ధి చేకూర్చుతామని చెప్పినప్పటికీ వ్యవసాయానికి మద్దతు ధర ప్రకటించకపోవటం వ్యవసాయరంగాన్ని విస్మరించటమే.

సీహెచ్ మణిలాల్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, రేపల్లె

చేనేతలను విస్మరించిన కేంద్రం



వ్యవసాయ రంగం తర్వాత రెండో అతి పెద్దదైన చేనేత రంగాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. లక్షల మంది కార్మికులు ఆధారపడి జీవించే చేనేత రంగానికి అరకొరగా కేటాయింపులు చేయడం దారుణం. చేనేత రంగానికి కేంద్ర ప్రభుత్వం రాయితీలు, తగ్గింపు ధరలకే రంగులు, రసాయనాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలను పట్టించుకోకపోవడం గర్హనీయం. చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు, చేనేత కార్మికులను ఆదుకునేందుకు ఇతర పథకాలు ప్రకటిస్తారని ఆశించి భంగపాటుకు గురయ్యాం.

– ఎ.సుబ్బారావు, చేనేత కార్మికుడు, ఈపురుపాలెం.

గంగపుత్రుల గోడు పట్టని కేంద్రం



ప్రాణాలను పణంగా పెట్టి గంగమ్మ తల్లిని నమ్ముకుని సముద్రంపైనే ఆధారపడి జీవించే గంగపుత్రులకు బడ్జెట్‌లో కేటాయింపులు పెద్దగా ఇవ్వకపోవడం తీవ్ర నిరాశకు గురయ్యాం. మత్స్యకారులకు కేంద్ర పథకాలు వచ్చేలా కూడా లేవు. పాలకులు చిన్నచూపు చూడటం దారుణం. గంగపుత్రలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నారడానికి బడ్జెట్‌లో కేటాయింపులే నిదర్శనం.

– ఓసిపిల్లి తాతారావు, మత్స్యకారుడు, వాడరేవు.

బడ్జెట్‌లో తీరని అన్యాయం



కేంద్ర బడ్జెట్ తీవ్ర నిరాశ పరిచింది. తీర ప్రాంతం అధికంగా ఉన్న మన రాష్ట్రానికి, తద్వారా బాపట్ల జిల్లాకు నిధులు కేటాయింపులు లేవు. తీరంలో హార్బర్‌లు, మినీ హార్బర్‌లు, ఆక్వా పార్కులు నిర్మించాలి. టూరిజం అభివృద్ధికి నిధులివ్వాలి. తీరం బేస్‌డ్‌గా పరిశ్రమలు వస్తే వేలాది మందికి ఉద్యోగ ,ఉపాధి అవకాశాలు వస్తాయి. మత్స్యకారులకు మేలు జరుగుతుంది. అన్ని రకాలుగా ఆదాయ వనరులు సమకూరుతాయి. వ్యవసాయ రంగానికి నిధులు నామమాత్రంగా ఇచ్చారు.

–గంగయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి, బాపట్ల

వైన్ షాపు దొంగల అరెస్టు

- అద్దంకి, బల్లికురవ మండలాల్లో ఒకే రోజు చోరీ
- ఏడుగురు నిందితుల అరెస్టు
- దొంగలు అందరూ యువకులే
- గ్యాంగ్ లీడర్‌గా పూజారి
- 792 మద్యం బాటిళ్లు, నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మొయిన్

అద్దంకి రూరల్: సరదాలకు, జల్సాలకు, చెడు అలవాట్లకు, మద్యానికి బానిసై, సులభంగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో చోరీలకు పాల్పడుతున్నారు యువకులు. వారంతా 25 ఏళ్ల వయసు లోపే. 8 మంది యువకులు ఒక టీమ్‌గా ఏర్పడి ఊరికి దూరంగా ఉండే షాపులను ఎంచుకుని రెక్కీ నిర్వహించి దొంగతనాలకు పాల్పడుతుంటారు. ఈనేపథ్యంలో అద్దంకి, బల్లికురవ మండలాల్లో ఒకే రాత్రి వైన్ షాపుల్లో భారీ చోరీలు జరిగాయి. ఈ కేసులను అద్దంకి సీఐ, సిబ్బంది రెండు రోజుల్లోనే ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. చీరాల డీఎస్పీ మొయిన్ శనివారం అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

తొలి దొంగతనమే భారీగా..

పల్నాడు జిల్లా వినుకొండ పట్టణం, పరిసర గ్రామాలకు చెందిన మండూరి శ్రీరామ్, తూమాటి చరణ్, సిద్దా బత్తుల రామసాయి, పోలా వెంకటరెడ్డి, నక్కా లక్ష్మణ్‌రావు, షేక్ చిన ఫరీద్ బాషా, వేముల నాగరాజు, అనిల్‌లు ఒక బృందంగా ఏర్పడ్డారు. వీరిలో మండూరి శ్రీరామ్ వినుకొండలోని ఒక గుడిలో పూజారిగా పనిచేస్తున్నాడు. మిగిలిన వారు ఆటో డ్రైవర్లుగా, బేల్దారీ పనులు చేస్తుంటారు. వీరిలో ఇద్దరు శ్రీరామ్ వద్దకు వచ్చి స్వామి మాలలు వేసుకున్నారు. ఆ పరిచయం స్నేహంగా మారింది. వినుకొండలో ఒక ప్రైవేటు కారు అద్దెకు తీసుకుని జనవరి 28వ తేదీన బల్లికురవ మండలం మీదుగా అద్దంకి-మేదరమెట్ల నామ్ హైవే పక్కన ఉన్న శాంతినగర్ సమీపంలోని మారుతి వైన్ వెనుక వైపులో వివిధ రకాల బ్రాండ్‌ల 685 మద్యం బాటిళ్లను, రూ.2.37 లక్షల నగదు దొంగిలించారు. అదే మండలంలోని కొప్పరపాడు గ్రామానికి దూరంగా వినుకొండ రోడ్డులోని అంకమ్మతల్లి వైన్స్‌లో కాపల ఉన్న వాచ్‌మన్‌ను బెదిరించి ఫోన్ లాక్కొన్నారు. షాప్ తాళాలు పగులకొట్టి అక్కడ 107 మద్యం బాటిళ్లు, రూ.20 వేల నగదు దొంగిలించి పరారయ్యారు. ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు డీఎస్పీ ఆధ్వర్యంలో అద్దంకి సీఐ సుబ్బరాజు దొంగతనాన్ని ఛేదించారు. శనివారం అద్దంకిలోని 99 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం సమీపంలో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి మద్యం బాటిళ్లు, నగదు, కారు, గడ్డపారను స్వాధీనం చేసుకున్నారు. 8వ నిందితుడు అనిల్ పరారీలో ఉన్నాడు. కేసు దర్యాప్తులో పాల్గొని వేగంగా ఛేదించిన సీఐను ఎస్సైలు ఖాదర్‌బాషా రవితేజ, సిబ్బంది బీ.వసంత్, జీ.అంకమ్మరావు, ఎం.వెంకట గోపయ్య, బీ.బ్రహ్మయ్య, జీ.అంజిబాబు, కె బలరామ్‌లను డీఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

పూజారే గ్యాంగ్ లీడర్..

పూజారి మండూరి శ్రీరామ్ గ్యాంగ్‌కు లీడర్‌గా వ్యవహరిస్తాడు. ఎవరు ఎక్కడ ఉండాలో, ఎవరు లోపలికి వెళ్లి చోరీ ఎలా చేయాలో సూచిస్తాడు. అందరూ శ్రీరామ్ చెప్పినట్లు నడుచుకుంటారు. వీరందరూ తొలిసారిగా భారీ చోరీకి పాల్పడ్డ వారే గతంలో చిల్లర దొంగతనాలు చేసేవారు. వీరిలో ఒక్క ఫరీద్ బాషా మీద మాత్రమే దొంగతనం కేసు ఉన్నది. మిగిలిన వారిపై ఏ స్టేషన్‌లోనూ కేసులు లేవు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి
- చినగంజాంలో విస్తృత తనిఖీలు



కేజీబీవీలో ఆహార పదార్థాల నాణ్యత పరిశీలిస్తున్న పద్మావతి

చినగంజాం: బాలల హక్కులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. మండల కేంద్రంలోని విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతి గృహాలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. ముందుగా ఆమె చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని పలు విభాగాలను తనిఖీ చేసి సూచనలు చేశారు. ఆస్పత్రిలోని ఆయుష్ విభాగాన్ని పరిశీలించి అక్కడి వైద్యురాలితో ఆయుష్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. బాలికల శారీరక సమస్యకు ఆయుర్వేద చికిత్సను నేరుగా అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ సాయి శ్రీచరణ్‌తో మాట్లాడి ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి తెలుసుకున్నారు. కస్తూర్బా బాలికా విద్యాలయాన్ని సందర్శించి మెనూపై ఆరా తీశారు. సోపిరాల అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి కేంద్రంలో నలుగురు విద్యార్థులు మాత్రమే ఉండటాన్ని గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేశారు.

అనుమతి లేకుండా వసతి గృహం నడపటంపై ఆగ్రహం

మున్నంవారిపాలెం పంచాయతీ పరిధిలో అనుమతి లేకుండా బాలుర వసతి గృహం నడుపుతున్న వ్యక్తులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 37 మంది విద్యార్థులకు వసతి కల్పిస్తూ రహస్యంగా కొనసాగించడం ఏ మాత్రం ఉపేక్షించే విషయం కాదన్నారు. ఇటీవల వసతి గృహంలో బాలునిపై వేడి పాలు పడి గాయాలపాలైన సంఘటనకు సంబంధించి ఆమె నిర్వాహకులను నిలదీశారు. అనంతరం స్థానిక బీసీ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. పలు సమస్యలను గుర్తించి వార్డెన్ పద్మపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలికలు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకొని వచ్చారు. తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, ఎంపీడీఓ ఎ.శ్రీనివాసమూర్తి, వైద్యాధికారి పి.సాయిశ్రీ చరణ్, కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎం.సుమాంజలి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వాణిశ్రీ పాల్గొన్నారు.

మహంకాళిని దర్శించుకున్న విశ్రాంత డీజీపీ



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ డీజీపీ ద్వారకా తిరుమలరావు కుటుంబ సభ్యులు

పర్చూరు(చినగంజాం): పెద జాగర్లమూడిలోని శ్రీ ఉజ్జయిని మహంకాళిదేవి అమ్మవారి దేవస్థానాన్ని రాష్ట్ర విశ్రాంత డీజీపీ ద్వారకా తిరుమలరావు కుటుంబసమేతంగా సందర్శించుకున్నారు. శనివారం ఉదయం దేవస్థానానికి చేరుకున్న ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శుక్రవారం డీజీపీగా ఉద్యోగ విరమణ చేసిన ద్వారకా తిరుమలరావు తల్లి మహంకాళమ్మ స్వగ్రామం పెద జాగర్లమూడి కావడంతో ఉజ్జయిని మహంకాళిదేవి అమ్మవారి దేవాలయాన్ని సందర్శించడం ఆనవాయితీగా వస్తోంది. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయన ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ సిబ్బంది వారికి తీర్థప్రసాదాలు ఇచ్చి పూలమాలతో సత్కరించారు. గ్రామస్తులు వారిని సత్కరించారు. జిల్లా అదనపు ఎస్పీ డీపీ విఠలేశ్వర్, డీఎస్పీ రామాంజనేయులు, మార్టూరు సీఐ శేషగిరిరావు, ఎస్ఐ మాల్యాద్రి, గ్రామస్తులు ధూళిపాళ్ల వెంకటస్వామి, మక్కెన శేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కానిస్టేబుళ్లకు అర్హత సాధించిన 14 మంది హోంగార్డులు

నగరంపాలెం: స్థానిక పోలీస్ కవాతు మైదానంలో శనివారం పలు జిల్లాల్లో పని చేస్తున్న హోంగార్డులకు కానిస్టేబుళ్ల దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మైదానానికి చేరుకుని పర్యవేక్షించారు. 40 మంది హాజరవ్వగా, ఏడుగురు ధ్రువపత్రాలు తీసుకురాలేదు. ముగ్గురికి శరీర కొలతలు సరిపోకపోవడంతో తిరస్కరించారు. మిగతా 30 మందికి 1600 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించగా, 14 మంది ఉత్తీర్ణత సాధించారు. నలభై మందికి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా 11 మంది ఉత్తీర్ణులయ్యారు. జిల్లా ఏఎస్పీలు రమణమూర్తి (పరిపాలన), హనుమంతు (ఏఆర్), ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలురెడ్డి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మార్చి 3 నుంచి ఇంటర్ దూరవిద్య పరీక్షలు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (దూర విద్య) ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 3 నుంచి 15 వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, ప్రభుత్వ పరీక్షల జిల్లా కోఆర్డినేటర్ కె.ఎం.ఎ.హుస్సేన్‌లు శనివారం తెలిపారు. ఈ మేరకు దూరవిద్య రాష్ట్ర డైరెక్టర్ ఆర్.నరసింహారావు ఉత్తర్వులు జారీ చేసినట్టు పేర్కొన్నారు. ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్‌లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలు పొందిన వారు పరీక్షలు రాసేందుకు అర్హులని తెలిపారు. పల్నాడు జిల్లా పరిధిలో 9 కేంద్రాలలో 2,387 మందిపరీక్షలకు హాజరు కానున్నట్టు వివరించారు. చిలకలూరి పేటలోని శారదా హైస్కూల్‌లో 302 మంది, నరసరావుపేటలోని మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, బాలుర పాఠశాల, కాసు బ్రహ్మానందరెడ్డి పాఠశాల, శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ కలిపి నాలుగు కేంద్రాలలో 1,094 మంది, సత్తెనపల్లిలోని జెడ్పీ హైస్కూల్ (బాలికలు), జెడ్పీ హైస్కూల్ (సుగాలీ కాలనీ) కలిపి రెండు కేంద్రాలలో 526 మంది, గురజాలలోని గుడ్‌న్యూస్ హైస్కూల్‌లో 205 మంది, వినుకొండ లయోలా హైస్కూల్‌లో 260 మంది పరీక్షలకు హాజరు కానున్నారని వివరించారు. పరీక్షలు ఆయా తేదీలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. మార్చి 3 వ తేదీన ఇంగ్లిష్, 5న హిందీ, తెలుగు, ఉర్దూ, 7న రసాయన శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, సామాజిక శాస్త్రం, 10న భౌతికశాస్త్రం, రాజనీతి / పౌర శాస్త్రం, మనోవిజ్ఞాన శాస్త్రం, 12న గణితం, చరిత్ర, వ్యాపార గణక శాస్త్రం, 15న జీవ శాస్త్రం, వాణిజ్య/వ్యాపార శాస్త్రం, గృహ విజ్ఞాన శాస్త్రం పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు.

హోరాహోరీగా ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన

ప్రథమ స్థానంలో బాపట్ల, ప్రకాశం జిల్లాల కంబైండ్ గిత్తలు


ప్రథమ బహుమతి సాధించిన బాపట్ల - ప్రకాశం జిల్లా గిత్తలు

రెంటచింతల: స్థానిక కానుకమాత చర్చి 175 వజ్రోత్సవ తిరుణాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు పోటాపోటీగా సాగాయి. జూనియర్ విభాగంలో జరిగిన ఈ ప్రదర్శనలో బాపట్ల జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి, ప్రకాశం జిల్లా కాజీపేట గ్రామానికి చెందిన వి.ఓసురారెడ్డి కంబైండ్ గిత్తలు 2,734 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి రూ.80 వేలను కైవసం చేసుకున్నాయి. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాకు చెందిన డి.రోహన్‌బాబుకు చెందిన గిత్తలు 2,700 అడుగుల దూరం లాగి రెండవ బహుమతి రూ.65 వేలను దక్కించుకున్నాయి. వైఎస్సార్ కడప జిల్లా కల్లూరి గ్రామానికి చెందిన పి.శివకృష్ణకు చెందిన గిత్తలు 2,478.10 అడుగుల దూరంలాగి 3వ బహుమతి రూ.45 వేలను కైవసం చేసుకున్నాయి. బాపట్ల జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన ఎ.శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి గిత్తలు 2,117 అడుగులు లాగి 6వ బహుమతి రూ.20 వేలను దక్కించుకున్నాయి. గుంటూరు జిల్లా లింగాయిపాలెం గ్రామానికి చెందిన యల్లం సాంబశివరావు గిత్తలు 2,075.8 అడుగులతో 8వ బహుమతి రూ. 10 వేలను దక్కించుకున్నాయి. గుంటూరు జిల్లా నాగులపాడు గ్రామానికి చెందిన పి. శ్రీనివాసరావు గిత్తలు 1,918.5 అడుగులు లాగి 9వ బహుమతి రూ. 9 వేలను గెలుచుకున్నాయి. పల్నాడు జిల్లా పమిడిమర్రు గ్రామానికి చెందిన వై. సుబ్బయ్య గిత్తలు 1,888.3 అడుగులు లాగి 10 వ బహుమతి రూ. 8,888 దక్కించుకున్నాయి. పల్నాడు జిల్లా రెంటాల గ్రామానికి చెందిన పి.ఈశ్వర్ ప్రణయ్ యాదవ్ కంబైండ్ గిత్తలు 1,290.7 అడుగులు లాగి 11వ బహుమతి రూ. 7,777 వేలను దక్కించుకున్నాయి. ఈ బలప్రదర్శనలో మొత్తం 12 జతలు పాల్గొన్నాయి. పోటీలను కమిటీ సభ్యులు వైఎల్ మర్రెడ్డి, ఆదూరి ఇన్నారెడ్డి, అల్లం ప్రతాప్‌రెడ్డి, గొంటు సుమంత్‌రెడ్డి, ఓ.ఇన్నారెడ్డి, బి.రామకృష్ణ, మూలి రాజారెడ్డి, ఎం.చిన్నశౌర్రెడ్డి, కె.జోసఫ్‌రెడ్డిలు బలప్రదర్శనను పర్యవేక్షించారు. ఈ నెల 3న సీనియర్ విభాగంలో బలప్రదర్శన ఉంటుందని న్యాయనిర్ణేతలు రాధాకృష్ణ, పి.సుబ్బారెడ్డి, శ్రీనివాస్ తెలిపారు.

ఇద్దరు ద్విచక్ర వాహన చోరులు అరెస్టు

రూ.8.50 లక్షల విలువైన 16 బైకులు స్వాధీనం


మాట్లాడుతున్న వినుకొండ రూరల్ సీఐ ప్రభాకర్‌రావు

నూజెండ్ల(శావల్యాపురం): ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.8.50 లక్షల విలువైన 16 బైకులు స్వాధీనం చేసుకున్నారు. వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్‌రావు శనివారం ఐనవోలు పోలీసు స్టేషనులో విలేకర్ల సమావేశంలో తెలిపిన వివరాల మేరకు... బైకు చోరీలపై ప్రత్యేక టీమ్స్ ఏర్పాటు చేసి నిందితులను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వివిధ గ్రామాల్లో దొంగిలించిన బైకులను నూజెండ్ల మండలం రవ్వారం కొండ వెనుక భాగాన నిందితులు దాచిపెడుతూ కొన్నాళ్లకు విక్రయిస్తున్నారని తెలిపారు. ఇలా స్వాధీనం చేసుకున్న 16 బైకుల విలువ రూ. 8.50 లక్షలని చెప్పారు. నిందితులైన రొంపిచర్ల మండలం విప్పర్ల రెడ్డిపాలెం గ్రామానికి చెందిన వనిపెంట బాలకాశిరెడ్డి, నూజెండ్ల మండలం రవ్వారం గ్రామానికి చెందిన పడిగాపాటి గురవారెడ్డిలను అరెస్ట్ చేశామన్నారు. వాహన తనిఖీల సమయంలో చిక్కిన వీరిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా అసలు విషయం వెలుగులోకి వచ్చిందని వెల్లడించారు. నిందితుల అరెస్టులో ప్రతిభ చూపిన ఐనోలు ఎస్సై కృష్ణారావు, సిబ్బందిని రూరల్ సీఐ అభినందించారు. రివార్డులకు సిఫార్సు చేస్తామని పేర్కొన్నారు.

లారీ ఢీకొని మిర్చి కమీషన్ వ్యాపారి మృతి

కారెంపూడి: లారీ ఢీకొని మిర్చి కమీషన్ వ్యాపారి మృతి చెందిన ఘటన మండలంలోని ఒప్పిచర్ల గ్రామ పెట్రోలు బంకు వద్ద శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. గురజాల వైపు నుంచి కారెంపూడి బైక్‌పై వస్తుండగా పెట్రోలు బంకు వద్ద ఘటన జరిగింది. ఫిరంగిపురం మండలం కండ్రిక గ్రామానికి చెందిన ఆళ్ల అనిల్‌కుమార్ (24) కమీషన్ వ్యాపారి. బైక్‌పై వస్తుండగా బంకు వద్ద ఆగి ఉన్న కారు డోరు తీయడంతో తగిలి రోడ్డుపై పడ్డాడు. ఇంతలో అటుగా వచ్చిన లారీ ఢీకొని అతనిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు లారీని స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ వాసు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

మాచవరం: వసతులు లేని హాస్టల్‌కు వెళ్లాలనే బాధతో ఎలుకల మందు తాగి చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి చెందిన ఘటన మండలంలోని మోర్జంపాడు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన విద్యార్థిని షేక్ గుల్జార్ (19) నరసరావుపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతోంది. సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చింది. సరైన సౌకర్యాలు లేని కళాశాల వసతి గృహానికి మళ్లీ వెళ్లాల్సి వస్తోందనే బాధతో డిసెంబర్ 23వ తేదీన ఎలుకల మందు నీటిలో కలుపుకొని తాగింది. చికిత్స నిమిత్తం పిడుగురాళ్ల, గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రులలో చేర్చారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి చనిపోయింది. విద్యార్థిని తండ్రి ఇబ్రహీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు

నార్కోటిక్ పోలీసుల పేరిట బురిడీ

నరసరావుపేట టౌన్: నార్కోటిక్ పోలీసుల పేరిట బెదిరించి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వద్ద రూ.11 లక్షలను సైబర్ నేరస్తులు కాజేశారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్ద చెరువు మూడవ లైనుకు చెందిన సాయిసత్యశ్రీ హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ప్రస్తుతం వర్క్ ఫ్రం హోం చేస్తూ నరసరావుపేటలో ఉంటున్నారు. ఈమెకు గతేడాది అక్టోబర్ 22వ తేదీన అజ్ఞాత వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. తాను ముంబై నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో నుంచి మాట్లాడుతున్నానని, తన పేరు ఆకాష్ అని పరిచయం చేసుకున్నాడు. ఆమె పేరుతో ఒక కొరియర్ వచ్చిందని, అందులో లాప్‌టాప్, 450 గ్రాముల గంజాయి ఉందని చెప్పాడు. ఆమె క్రెడిట్ కార్డుతో ఇవి కొనుగోలు చేసినట్లు, సదరు క్రెడిట్ కార్డు నెంబర్ చెప్పి నమ్మించాడు. అరెస్ట్ చేస్తామని బెదిరించాడు. భవిష్యత్తు దెబ్బతినకుండా ఉండాలంటే తనకు రూ.11 లక్షలు ఇచ్చి సెటిల్ చేసుకోవాలన్నాడు. దీంతో సత్యశ్రీ తన ఖాతా నుంచి అజ్ఞాత వ్యక్తి చెప్పిన ఖాతాకు రూ.11 లక్షలు నగదు పంపారు. ఈ విషయాన్ని రెండో రోజు కుటుంబ సభ్యులకు తెలిపారు. వారిచ్చిన సలహా మేరకు అక్టోబర్ 24వ తేదీన సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో శనివారం టూ టౌన్ పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లేఖ ప్రియాంక తెలిపారు.

మార్చి 8న జాతీయ లోక్‌అదాలత్

- కక్షిదారులకు న్యాయం చేకూరేలా అధికారులు కృషి చేయాలి
- సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు


పోలీసు అధికారులకు సూచనలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి టీ వెంకటేశ్వర్లు

రేపల్లెరూరల్: మెగా లోక్‌అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించి కక్షిదారులకు న్యాయం చేకూరేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ టీ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక సబ్‌కోర్టు ప్రాంగణంలో మార్చి 8వ తేదీన జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారం అయ్యేలా పనిచేయాలని కోరుతూ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో శనివారం స్థానిక కోర్టు హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించి కక్షిదారులకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతో న్యాయశాఖ ప్రతినెలా లోక్ అదాలత్ నిర్వహిస్తోందన్నారు. కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్, లోక్‌అదాలత్ సభ్యులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

డీపీఎంవో సారంగపాణి


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నిజాంపట్నం: కుష్టు వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ సారంగపాణి సూచించారు. జాతీయ కుష్ఠు వ్యాధి నివారణ దినోత్సవ కార్యక్రమాలలో భాగంగా మండలంలోని ప్రజ్ఞం పంచాయతీ అట్లవారిపాలెంలో శనివారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శలేని రాగివర్ణ మచ్చలు ఉండినా, శరీరంపై రంగుమారిన మచ్చలు, పొడలు, లావుగా మారిన నరాలు, నొప్పులతో కూడిన నరాలు, కాళ్లు, చేతుల కండరాలలో బలహీనత, చేతులు, పాదాలు, నరాలలో తిమ్మిర్లు అనిపించటం, కళ్లు పూర్తిగా మూసుకోలేకపోవటం, చెవి తమ్మెలు మందంగా మారటం, చర్మం, చెవి తమ్మెలపై బుడిపెలు ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఆయా లక్షణాలు కనిపించిన వారు వెంటనే వైద్యశాలలో సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. గ్రామంలో పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డీపీఎంవో వెంకటేశ్వర్లు, సూపరవైజర్ మురళి, ఆశా కార్యకర్త రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో గంజాయి కలకలం

యువకుడు, ఇద్దరు మహిళలు అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న గుంటూరు జిల్లా క్రైమ్ అడిషనల్ ఎస్పీ రవికుమార్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మరోసారి గంజాయి విక్రయాలు బయటపడ్డాయి. పోలీసులు శనివారం చాకచక్యంగా వ్యవహరించి గంజాయి విక్రయిస్తున్న యువకుడు సహా కొనుగోలు చేస్తున్న ఇద్దరు పాత మహిళా నేరస్తులను అరెస్టు చేశారు. విలేకరుల సమావేశంలో గుంటూరు జిల్లా క్రైమ్ అడిషనల్ ఎస్పీ రవికుమార్ మాట్లాడుతూ... ''తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేటకు చెందిన గాజుల హరీష్‌కుమార్ చెడు వ్యసనాలకు అలవాటు పడ్డాడు. మన్యం జిల్లా పాడేరు దగ్గర విజయకుమార్ అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసేవాడు. ఇక్కడికి తీసుకొచ్చి చిన్న పొట్లాలుగా మార్చి విక్రయిస్తున్నాడు. గంజాయి కేసుల్లో అరెస్టైన పాత నేరస్తులు నాగమణి, రోజాలు ఇటీవలే జైలు నుంచి విడుదలయ్యారు. వీరికి తాడేపల్లి రైల్వేస్టేషన్ వద్ద గాజుల హరీష్‌కుమార్ గంజాయి ఇస్తున్నాడని తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజుకు సమాచారం వచ్చింది. దీంతో ఆయన సిబ్బందితో మఫ్టీలో కాపు కాసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కేజీ 150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు'' తెలిపారు. గంజాయి క్రయవిక్రయాలు చేసిన వారి గురించి ప్రజలు సమాచారం ఇవ్వాలని సూచించారు. వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఫ్లోర్‌బాల్ అండర్–17 జిల్లా జట్ల ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన బాలురు, బాలికలు

నరసరావుపేట ఈస్ట్: ఫ్లోర్‌బాల్ అండర్–17 బాల బాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలను గుంటూరు రోడ్డులోని కే-రిడ్జి పాఠశాలలో శనివారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 8, 9వ తేదీలలో చిలకలూరిపేటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని పాఠశాల ప్రిన్సిపల్ జి.బర్నబాస్, ఫ్లోర్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లవరపు కిషోర్ తెలిపారు. బాలుర విభాగంలో జి.జస్వంత్, కె.రక్షణ్ ఆనంద్, ఎస్.వీరవెంకటవరుణ్, ఎస్.శశాంక్, జె.రోహిత్, ఎల్.మణికంఠరెడ్డి, బి.వెంకటగౌతమ్, ఎం.నాగభానుప్రసాద్, ఎం.జగత్, ఎం.షణ్ముఖ్ సాయి, కె.హర్షిత్, యు.హేమచంద్ర, జె.హర్షిత్, ఎం.హేమంత్, బి.మణిదీప్, కె.సాయిచరణ్‌లు ఎంపికయ్యారు. అండర్–17 బాలికల జట్టుకు ఎం.హృదయరెడ్డి, జి.వైష్ణవి, ఎం.దీప్తిప్రియాంక, ఎస్.అశ్వత, షేక్.మహసిన్, నిరీక్షణ, ఎస్.హంసిని, ఎ.హర్షిణి, జి.రమతేజ, జి.హాసినిలు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, క్యాంపస్ ఇన్‌చార్జ్ కోట బాపూజీ, అకడమిక్ కో ఆర్డినేటర్ పుట్ట హేమంత్‌లు అభినందించారు.

తల్లిదండ్రులు గర్వపడేలా ఎదగాలి

- టొబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు
- విజ్ఞాన్‌లో వైభవంగా ముగిసిన బాల మహోత్సవ్


బాల మహోత్సవ్ ముగింపులో మాట్లాడుతున్న టొబాకో బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు

చేబ్రోలు: తల్లిదండ్రులు గర్వపడేలా విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని గుంటూరులోని టొబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో రెండు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి విజ్ఞాన్ బాల మహోత్సవ్ శనివారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన అద్దంకి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు విభిన్న ఆలోచనలు, క్రియేటివిటీతో ముందుకు దూసుకుపోవాలని తెలిపారు. బాల్యం నుంచే విభిన్నంగా ఆలోచించే అలవాటును పెంచుకోవాలని సూచించారు. జీవితంలో ఏమి సాధించాలనుకుంటున్నారో దాన్ని పొందే వరకు కృషి చేయాలని చెప్పారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులందరూ చక్కగా చదువుకుని మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎమోషనల్‌గాను, మెంటల్‌గాను దృఢంగా ఉండాలని సూచించారు. ఓటములను తట్టుకునే మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకుని సంపూర్ణమైన వ్యక్తిత్వం సాధించాలని తెలిపారు. మారుతున్న జీవనశైలిలో ప్రతి విద్యార్థీ ఆరోగ్యంగా ఉండాలంటే ఏదో ఒక క్రీడలో మక్కువ చూపించాలని చెప్పారు.

వేలాదిగా పాల్గొన్న విద్యార్థులు

రాష్ట్ర స్థాయి విజ్ఞాన్ బాల మహోత్సవ్‌లో మొత్తం 50 ఈవెంట్లను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు విలువైన నగదు బహుమతులతో పాటు ట్రోఫీలను అందించారు. బాల మహోత్సవ్‌లో పాల్గొనేందుకు రాష్ట్రంలోని వివిధ స్కూల్స్ నుంచి ఐదు వేల మందికి పైగా విద్యార్థులు ఆయా క్రీడాంశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న శ్రీధర్‌బాబు, చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చాన్సలర్ నాగభూషణ్ తదితరులు


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు